# సత్యనారాయణ వ్రత కధ - క్రియా పద్ధతి

సత్యనారాయణ వ్రతకథ తాత్పర్యము సత్యమును సాక్షాత్ భగవంతునిగా భావించి జీవితములో సత్యవ్రతం తీసుకోవటం గురించి చర్చ. సత్యం మాట్లాడుట అనేది చిన్న క్రియ మాత్రమే కాకుండా జీవితంలోని ప్రతి రంగంలో ధర్మం, కర్తవ్యము, నీతి, సదాచారము, మర్యాద, వివేకముల ఆధారంగా చేసెడి ఆలోచన, ఆచరణలే సత్యనిష్ఠ యొక్క సమగ్రరూపం. సత్యం మాట్లాడుట కూడా సత్యనిష్ఠయొక్క సూక్ష్మ రూపం మాత్రమే. కానీ ఏ సత్యాన్ని నారాయణుడని చెప్పారో అది సత్యం మాట్లాడుట వరకే పరిమితమైనది కాదు, సమస్త మనోవృత్తులను, ఆకాంక్షలను, క్రియాకలాపాలను ఎప్పుడైతే ధర్మ మర్యాదల కనుగుణంగా చేస్తామో, అప్పుడు సత్యరూపియైన భగవంతుడు జీవితంలో అవతరిస్తాడు. ఈ అవతరణయే ఈశ్వర ప్రాప్తి లేదా ఈశ్వర దర్శనము.

ఈ వ్రత కథలో భిక్షాటన చేసే బ్రాహ్మణుడు, కట్టెలు కొట్టి జీవించేవాడు, లీలావతి-కళావతి, సాధువైశ్యుడు, తుంగధ్వజుడు, చంద్రకేతువు మొ॥ వారి వర్ణన వున్నది. వానిలో ఒకే ఒక తథ్యమేమిటంటే సత్య నిష్ఠననుసరిస్తూ సత్యనారాయణుని వ్రతం



స్వీకరిస్తే లౌకిక, పారలౌకిక రెండు జీవితాలు సుఖము, శాంతిమయం అవుతాయి. మఱియు ఈ సత్యవృత్తిని వదలిన వారు నానావిధములైన కష్టాలు ఎదుర్కొంటారు. ఈ కథలలో యివ్వబడిన ఉదాహరణలు చెప్పేది, బోధించేది, చక్రధారియైన కృష్ణుని, ధనుర్ధారియైన రాముని భగవానునిగా భావించి అంతటితో సంతుష్టి చెందక, సత్యాచరణ ద్వారా ఆ భగవానుని ప్రత్యక్ష సంపర్కములో వుండగలగాలి. సదాచారుడైన వ్యక్తి అనాయాసంగానే ఈశ్వరుని కృపకు పాత్రుడు కాగలడు. జీవితంలో అన్ని వైపులా ఆనందము, శుభము నిండివుంటాయి. ఎవరైనా నారాయణుని సత్యము రూపముతో కాక భోగము, నైవేద్యము, స్తవనము పూజల ద్వారా సంతృప్తి చెందిన అది బాల్యక్రీడయే అవుతుంది. తద్వారా చివరికి వాస్తవిక ప్రయోజనం లభించదు.

ప్రజల మనస్సులలో సదాచరణ, సద్భావనలను ప్రతిష్ఠించుటకు సత్యనారాయణ వ్రతకథ అధికాధిక ప్రచారం అవసరము. **విషాదమేమిటంటే దాని వాస్తవిక తాత్పర్యము ఎవరూ అర్థము చేసుకోవటం లేదు, అర్థమయ్యేటట్లు చెప్పుటలేదు**. కథ విని పంచామృతము, ప్రసాదము తీసుకొని ప్రజలు తమ బాధ్యత పూర్తయిందని భావిస్తున్నారు. రూపాయి పావలా దక్షిణతో పుణ్యం



లభించిందని, కథలోని పాత్రలకు లభించిన లాభమే తమకు కూడా లభిస్తుందని భావిస్తున్నారు. ఈ ఆశ నిరాశగానే పరిణమిస్తుంది. **ఒకటి రెండు రూపాయలు, ఒకటి రెండు గంటల సమయం ఏదైనా కర్మాకాండలో వినియోగిస్తేనే లభించటానికి, ఈశ్వరుని కృప యింత చౌకకాదు,** అందుకోసం జీవితాన్ని సంస్కరించుకొనుట, నిర్మాణము, వికాస ప్రక్రియ అనివార్యంగా పూర్తి చేసుకోవాలి. ఈ ప్రయోజనం కోసం శ్రీ సత్యనారాయణ కథను ప్రజల మనస్సులదాకా చేర్చగల్గితే దానివలన సహజంగానే ఒక పెద్ద పుణ్యఫలం లభిస్తుంది. పురోహితులు, విచారశీలురైన శ్రోతలు ఈ ధర్మానుష్ఠానమును ఆ విధంగా వుపయోగపెట్టాలి.

సత్యనారాయణ వ్రత కథలన్నిటిలోనూ, అన్ని వర్గముల వారికీ మార్గ దర్శనం లభిస్తుంది. సమాజంలో నాలుగు శక్తులు ప్రధానంగా పనిచేస్తుంటాయి. అవి 1. జ్ఞానము, 2. బలము 3. ధనము, 4. శ్రమ. ఈ అన్ని శక్తుల యొక్క వికాసము, సదుపయోగము, సమాజ శ్రేయస్సు దృష్ట్యా చాలా అవసరం. ఈ నాలుగు శక్తులలోనూ సంపన్నులైన వ్యక్తులే, వరుసగా 1. బ్రాహ్మణ 2. క్షత్రియ 3. వైశ్య 4. శూద్రులుగా పిలవబడెదరు. ఈ శక్తులు గల వ్యక్తులను సత్యనారాయణులుగా చేసి, సమాజానికి సుఖ సమృద్ధుల



నందజేసేందుకు సత్యనారాయణ వ్రతకథ మార్గదర్శనాన్నందిస్తుంది.

'యుగ నిర్మాణ యోజన' లో భాగంగా జన జీవనంలో సత్యనిష్ఠ జాగృతం చేసేందుకు, తదనురూపంగా ఆచరించేందుకు, సాహసం జాగృతం చేయుటకు సత్యనారాయణ వ్రతకథ అత్యంత ఉపయోకారిగా భావించబడింది. కథలో కేవలం వ్రతం యొక్క పలశ్రుతియేకాక, దాని యొక్క వ్యావహారిక, సైద్ధాంతిక పక్షము వ్యక్తం చేయబడింది. ప్రజలు దీనిని విని, అర్థం చేసుకొని సత్యనిష్ఠులు కావాలి, సత్యమయ జీవనులై వ్యక్తిగత మఱియు సామాజిక జీవితాన్ని సమున్నతము, సుఖవంతము చేసుకోవాలి. సత్యాచరణపట్ల తమ నిష్ఠ ప్రకటించాలి, జన జీవితంలో ఈ ప్రేరణ పెంపొందించేందుకు ఈ కథా ఉత్సవాలు పెద్ద ఎత్తున జరపాలి. ఇదొక మంచి సంప్రదాయంగా తయారవుతుంది.

సత్యవ్రతం యొక్క ఈ కథ దేశంలోని అనేక ప్రదేశాల్లో చాలా ప్రసిద్ధి కలిగి వున్నది. ప్రజల శ్రద్ధాభావన సహజంగానే దీని పట్ల పెల్లుబుకుతుంది. సమర్థులైన పురోహితులు దీని ద్వారా మంచి లోకశిక్షణ చేయవచ్చు. యుగనిర్మాణ యోజన దీనిని ఒక ఉద్యమంగా నిర్వహిస్తున్నది.

దీనిని విభిన్న పద్ధతుల్లో, విభిన్న స్థాయిలలో నిర్వహించవచ్చు. రోజుకొక కథ పద్ధతిలో, విపుల వ్యాఖ్యానంతో అయిదురోజుల కథగా చెప్పవచ్చును. ఆకర్షణీయమైన మండపము, వేదిక శ్రోతలను ఆకర్షంచుటలో సహాయకారి కాగలవు. మొదటి రోజు జలకలశయాత్ర చేసి ముగింపురోజు గాయత్రి యజ్ఞము నిర్వహించవచ్చును. ఈ కార్యక్రమాలలోనే సామూహిక సంస్కారాలు నిర్వహించవచ్చును. సమయాన్ని అందరికీ అనుకూలంగా నిర్ణయించుకోవాలి. దేవపూజనం స్వస్తివాచనంతో ప్రారంబించి, ఆరతి, శుభకామనలతో విసర్జన చెప్పాలి.

## గాయత్రీ మహా మంత్రము

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం**
**భర్గోదేవస్య ధీమహీ ధియోయోనః ప్రచోదయాత్ ॥**

**భావము :** ఆ ప్రాణస్వరూపమైన, దుఃఖ నాశకమైన, సుఖ స్వరూపమైన, శ్రేష్ఠమైన, తేజస్సుగల, పాపనాశకమైన, దేవ స్వరూపమైన పరమాత్మను మేము అంతరాత్మలో ధరించెదము గాక! ఆ పరమాత్మ మా యొక్క బుద్ధిని సన్మార్గము వైపు ప్రేరేపించుగాక!



## మొదటి అధ్యాయము

**వ్యాస ఉవాచ :**

1. ఏ కదానైమిశారణ్యే ఋషయః శౌనకాదయః
   పప్రచ్ఛుర్మునయస్సర్వే సూతం పౌరాణికం ఖలు

ఒకప్పుడు నైమిశారణ్యమనే పేరుగల పుణ్య స్థలంలో శౌనకాది మహర్షులు, సూత మహామునిని ఈ విధంగా ప్రశ్నించారు.

**శౌనక ఉవాచ :**

2. వ్రతేన, తపసా, కింవా, ప్రాప్యతే, వాంఛితం ఫలం
   తత్సర్వం శ్రోతుమిచ్ఛామి, కథయస్వ మహామునే

కోరిన ఫలితాన్ని పొందే వ్రతాన్ని లేదా తపస్సును మాకు తెలిజెప్పండి.

**సూత ఉవాచ :**

3. ఏకదా నారదోయోగీ పరానుగ్రహ కాంక్షయా
   పర్యటన్వివిధాన్లోకాన్మర్త్యలోకముపాగతః



ఒకమారు నారద మహర్షి లోక కళ్యాణము కొరకు వివిధ లోకాలు పర్యటిస్తూ మర్త్యలోకానికి వచ్చారు.

4. తతో దృష్ట్వా జనాస్సర్వాన్, నానాక్లేశ సమన్వితాన్
   నానాయోని సముత్పన్నాన్ క్లిశ్యమానాన్ స్వకర్మభిః

అక్కడ ఎక్కువ మంది ప్రజలు, తమ దుష్కర్మల ప్రభావం వల్ల నానా కష్టాలను పడుతుండటం చూచారు (కష్టాలు పడటానికి మనమే కారకులమని మనమందరమూ గ్రహించాలి. అది మన దుష్కర్మల ప్రభావమేనని తెలుసుకోవాలి).

5. కేనోపాయేవ చైతేషాం దుఃఖ నాశోభవేద్ధ్రువం
   ఇతి సంచింత్య మవసా విష్ణులోకం గత స్తదా ॥

ప్రాణులయొక్క కష్టాలను, దుఃఖాలను ఏవిధంగా అరికట్టాలీ అని ఆలోచిస్తూ విష్ణులోకం చేరారు. విష్ణుభగవానుని అందుకు ఉపాయం చెప్పమని కోరారు.

**శ్రీ భగవానువాచ :**

6. సత్యనారాయణ స్యైకం, వ్రతం సవిధి విధానతః
   కృత్వా సద్యః సుఖంభుక్త్వా, చాంతే మోక్షమవాప్నుయాత్ ।



విష్ణుమూర్తి యిలా అన్నారు. హే నారదా! సత్యనారాయణ వ్రతమనే వ్రతం ఒకటి ఉన్నది. దానిని విధి, విధాన పూర్వకంగా, ఆచరించినవారికి ఈ జీవితంలో సుఖం కలుగుటయే గాక, మరణానంతరం సద్గతి యశస్సు లభిస్తాయి.

7. నారాయణ స్వరూపంహి, సత్యమస్తి చ యోనరః
   వ్రతం గృహ్ణాతి సత్యస్య, భవతు సత్యానుకంపితః ॥

సత్యము భగవానుని వాస్తవరూపము, అది తెలిసి మనుష్యుడు సత్యనారాయణ వ్రతమునాచరించాలి. అతడు మాత్రమే ప్రభువు కృపను పొందగలడు. (భగవంతుడు వ్యక్తి రూపి కాడు భావనారూపుడు. సత్యము ఆయన సర్వశ్రేష్ఠ స్వరూపము)

8. నారద ! మర్త్యలోకేస్మిన్మానవాః సత్యధర్మయోః
   లభంతే దుఃఖమత్యంతం త్యాగేనైవచ సర్వదా ॥

హే నారదా ! ప్రపంచంలో ప్రజలు సత్య, ధర్మాచరణను విస్మరించటం వల్లనే, కష్టాలపాలవుతున్నారు.

9. వ్యవహారంచ సత్యం చేత్తే ధర్మాచరణం తథా
   సముద్యతాః స్యుః కర్తురై, ముక్తిందుఃఖేభ్యః ప్రాప్నుయుః ॥

ఎప్పుడైతే మనుష్యుడు మాటలలోగాక, చేతలలో సత్యధర్మపాలన చేయటం మొదలుపెడతాడో అప్పుడు దుఃఖము నుండి విముక్తుడు కావటం సునిశ్చితం.

10. చత్వారస్సంతి ధర్మస్య పాదాః వృషభ రూపిణః
వివేకః, సంయమః, సేవా, తురీయః సాహసం శుభః ॥

ధర్మ స్వరూపమైన వృషభమునకు నాలుగు పాదాలు ఉన్నాయి. అవి 1. వివేకం 2. సంయమము 3. సేవ 4. సాహసం. సత్య, ధర్మపాలన చేసే ప్రతి వ్యక్తిలోనూ, ఈ నాలుగు లక్షణాలూ ఉండితీరుతాయి.

**1. వివేకము :**

పెద్దల మాట వినటం ధర్మసమ్మతమే గాని అంతకన్న వివేకం ముఖ్యం. అన్నను వదలిన విభీషణుడు, తండ్రిని కాదన్న ప్రహ్లాదుడు, తల్లిని కాదన్న భరతుడు, గురువు శుక్రాచార్యుని కాదన్న బలిచక్రవర్తి, పతిని కాదన్న భక్త మీరా వివేకంతో వ్యవహరించిన వారు.

**2. సంయమము :**

సంయమంతో, లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించాడు. అర్జునుడు



దివ్యాస్త్రాలను పొందాడు. శివాజీ మహా రాజు భవానీ కృపకు పాత్రుడైనాడు. మహర్షులు మునులు సంయమంతోనే ఆంతరిక శక్తులను వికసింపజేసుకున్నారు.

**3. సేవ :**

సేవ వలన హనుమంతుడు అంత గొప్పవాడైనాడు. శబరి రాముని చేత ఎంగిలి తినిపించగలిగింది.

**4. సాహసము :**

జటాయువు రావణుని గొప్పతనం తెలిసికూడా, ధర్మము కొరకు పోరాడి, ప్రాణాలు పోగొట్టుకొని అమరుడైనాడు. నచికేతుడు సాహసంతో యమునివద్దకు పోయి చిర యశస్సును పొందాడు.

11. మాల్యకారః ఇవోద్యానే, సదాస్వకృత్యపరాయణః
పోషణం వర్ధనంచాస్య, కురుతేనియమైః సర్వశః ॥

సత్య ధర్మ పరాయణుడైన వ్యక్తి తన కుంటుంబాన్నీ, సమాజాన్నీ పూల తోటలుగా భావించి, కర్తవ్యనిష్టుడైన తోటమాలి వలె పాలన పోషణ చేస్తాడు.



12. లోభ మోహత్వమాత్సర్య, మదకామాది దూషణైః
రహితం హృదయం తేషాం, నఛిద్రాన్వేషణాశ్చతే ॥

సత్యనిష్టులైన వారి హృదయంలో కామ, క్రోధ, లోభ, మోహ, మధ, మాత్సర్యాలు ఉండవు. ఇతరులలో లోపాలను ఎంచరు. ఈర్ష్య, అసూయ ఉండవు.

13. నారాయణం సత్యరూపం, యః స్థాపయతి సర్వదా
స ఏవ జాయతే పాత్రం, ప్రసాదస్య ప్రభో స్సదా ॥

నారాయణుడు సత్యస్వరూపుడని విశ్వాసం కలిగిన వ్యక్తి, నిస్సందేహంగా భగవానుని పరమ కృపాపాత్రుడు అవుతాడు.

## రెండవ అధ్యాయము

**సూత ఉవాచ :**

14. అథాన్యత్సం ప్రవక్ష్యామి కృతం యేన పురాద్విజ
కశ్చిత్కాశీ పురే రమ్యేహ్యాసీద్విప్రో అతి నిర్ధనః ॥

సూత మహర్షి ఈ విధంగా చెప్పారు. మహర్షులారా ! మీకు పూర్వం సత్య వ్రతమును ఆచరించిన వారికి సంబంధించిన కథలు



వినిపిస్తాము. ఒకప్పుడు కాశీ నగరంలో చాలా బీదవాడైన బ్రాహ్మణుడు నివసించేవాడు.

15. ద్విజనామ్నా సదానందో, దైన్యభావముపాగతః
ఉదరపూర్తయే భిక్షాం దుఃఖేన విచరత్సదా ॥

ఆ బ్రాహ్మణుని పేరు సదానందుడు, అతడు దారిద్ర్యం కారణంగా దీనుడై వ్యాకులుడై, పొట్టకూటి కొరకు భిక్షమెత్తుకొని తిరుగుతుండేవాడు. భగవంతుడు అతనికి మార్గదర్శనం చేయాలనే ఉద్దేశ్యంతో, వృద్ధ బ్రాహ్మణుని రూపంలో అతడి వద్దకు వెళ్ళి, ఇలా అన్నాడు.

16. దూరం గతస్త్వం హే విప్ర ! వ్యాపేక్షితం సత్కర్మణః
కష్టః ప్రాప్నోషి తేనైవ, నిదానం త్వ సత్సేవనం

హే సదానందా ! నీవు బ్రాహ్మణోచిత సన్మార్గము వదిలి, అసన్మార్గంలో నడవటం వల్ల ఈ కష్టాలు పడుతున్నావు.

**బ్రాహ్మణుని కర్తవ్యము :** 1. తాను జ్ఞానమును పొంది, యితరులకు జ్ఞానాన్ని ఉపదేశించటం, 2. తాను శీలవంతుడై సమాజంలో శీల సంపదను పెంపొందించటం. 3. శ్రేష్ఠమైన పనులకు సహకారాన్నందీయటం.

17. ఆకర్షణం భిక్షాయాః, త్యాజ్యం చాన్యేషుయత్త్వయా
సమాజాల్లభతే విప్రోయదనేకగుణం పునః
సేవాసాధనరూపేణ, తందదాతి సునిశ్చితం ॥

భిక్షాటనం సోమరితనముతో కూడినది. బ్రామ్మణులకు ఉచితం కానట్టిది. బ్రాహ్మణుడు తాను సమాజము నుండి పొందిన దానికన్న ఎన్నోరెట్లు ఎక్కువ జ్ఞానదానము, సేవా సాధనల రూపంలో సమాజానికి తిరిగి చెల్లించాలి.

18. త్యక్త్వాదైన్యం, భయంచాపి, హ్యాలస్యంచా కర్మణ్యతాం
కురుష్వజాగృతం స్వీయం, బ్రహ్మతేజశ్చ విప్ర ! ॥

హే విప్రుడా ! నీవు దైన్యమును సోమరితనమును, భయమును, అకర్మణ్యత్వమును వదిలి, బ్రహ్మతేజమును జాగృత మొనర్చు కొనేటందుకు సాధన చేయాలి.

19. విద్యాధ్యేతా చ స్వాధ్యాయీ, భవధర్మం ప్రచారయ
గుణ, కర్మ స్వభావానాం, దృష్ట్యా ధర్మోభవేత్తథా ॥

విద్యను వృద్ధి చేసుకో, స్వాధ్యాయం చెయ్యి, ధర్మ ప్రచారం చెయ్యి. నీ గుణ, కర్మ, స్వభావములతో ఇతరులకు ఆదర్శంగా ప్రవర్తించు.



20. గత్వాప్రతిగ్రహం సర్వం, జనచేతసి ధార్మికీమ్
జాగృతిం కురు సర్వత్ర, కర్తవ్యంచతవాస్తితత్ ॥

నీ ప్రధాన కర్తవ్యము, ఇంటింటికీ వెళ్ళి, ప్రజలందరిలోనూ, ధార్మిక చేతనను జాగృతం చేయడం.

21. భగవతో హి వచః శృత్వా, వృద్ధబ్రహ్మణ రూపిణః
కృతఃసుధారో దేవేన, హ్యాచారం పరివృత్యచ ॥

వృద్ధ బ్రాహ్మణ రూపియైన భగవానుని ఆదేశములను శిరసావహించి సదానందుడు తన ఆచరణను పూర్తిగా చక్కదిద్దుకున్నాడు.

22. తేనజాతాప్రతిష్ఠావై, తేజస్విత్వమవాపయత్
శ్రద్ధయా, సహయోగేన, సర్వేభావాహ్యక్షయత్ ॥

సత్యవ్రత పాలనతో, అతని ప్రతిష్ఠ యినుమడించింది. సమాజము యొక్క శ్రద్ధాపూరిత సహకారంతో అతని దరిద్రం తొలగిపోయింది. అతడు తేజస్సుతో గూడిన జీవనాన్ని పొందాడు.

23. సవిప్రోహి తతః సత్యనారాయణ వ్రతస్య చ
ఖ్యాపయితుం మహత్వంతు, ధర్మానుష్ఠాన రూపిణం ॥



అతడు సత్య, ధర్మ పరాయణత యొక్క మహత్వమును అందరికీ తెలియజేయటానికి ఉత్సవాలను వ్రతములను చేయసాగాడు.

24. ప్రాప్తః కాష్ఠస్యవిక్రేతా, మహత్తాం దృష్టవాన్స్వయం
లాలాయితో భవేజ్ఞాతుం, సత్యస్యశుభదం వ్రతం ॥

ఒక ఉత్సవ సందర్భంలో, ఒక కట్టెలమ్ముకునేవాడు, అక్కడకు వచ్చి వ్రతం పూర్తయేవరకూ ఉండి, సదానందుని వలన సత్యవ్రత నియమాలను తెలుసుకునే జిజ్ఞాస చూపగా

**సదానందా ఉవాచ :**

25. శ్రమస్య మహతీ సంపద్వర్తతే తవ సన్నిధౌ
సమ్మాన్యోహి శ్రమోనిత్యం కార్యశ్చలగ్న చేతసా ॥

సదానందుడిట్లా అన్నాడు. సోదరా! నిన్ను నీవు దీనునిగా తలచవద్దు. నీ వద్ద శ్రమ అనే గొప్ప సంపద ఉన్నది. శ్రమ యెడల గౌరవాన్ని నీలో పెంపొందించుకో, శ్రద్ధతో శ్రమించు.

26. ధారితం చ వ్రతం తేన, కాష్ఠ విక్రేతయా తతః
గుణ, కర్మ, స్వభావాశ్చ, సత్యాను శృతిశోధతాః ॥

ఆ కట్టెలమ్ముకునే వాడు, కట్టెలమ్మటంతో పాటు సత్యవ్రత పాలన



చేయసాగాడు. అతని గుణ, కర్మ స్వభావములలో సత్యవ్రతునికి తగిన మార్పులు కలిగాయి.

27. ఆసీత్పూర్వంతు తస్యాపి, చాత్స్వల్పః కాష్ఠ విక్రయః
సమృద్ధో సౌ వ్రతేనైవ, కృతః సత్యప్రభోఃఖలు

అంతకు ముందు అతని విక్రయం స్వల్పంగా ఉండేది. సత్య వ్రతావలంబనతో, అతని అమ్మకాలు బాగా పెరిగాయి. నమ్మకం వల్ల ప్రజలకు విశ్వాసపాత్రుడు కాగలిగాడు.

28. విప్రః కాష్ఠస్య విక్రేతా, సమృద్ధో భవత్సూఎర్ణతః
సద్గతిం సుఖశాంతించ, సంప్రాప్యహి వ్రతేనచ ॥

బ్రాహ్మణుడు, కట్టెలమ్మేవాడు, సత్యవ్రత ప్రభావం వల్ల, సుఖ శాంతులను, సద్గతిని పొంది, తమ జీవితాలను సార్థకం చేసుకున్నారు.

29. ఏవం సత్యవ్రతం శ్రత్వా, శ్రద్ధయాచేచ్చస్వీకృతః
తథా న్యేపి స్వకళ్యాణం, కర్తుశ్శక్త్వాభవన్తి వై ॥

ఈ విధంగానే, అందరూగూడ, సత్య వ్రతధారణ చేయటం వల్ల, నిశ్చయంగా తమ్ము తాము కృతార్థులను చేసుకొని, యితరులను కృతార్థులను చేయగలుగుతారు.

## మూడవ అధ్యాయము

**సూత ఉవాచ :**

30. పునరగ్రే ప్రవక్ష్యామి, శృణుధ్వం మునిసత్తమాః
పురాచోల్కాముఖోనామ, నృపశ్చాసీన్మహామతిః

సూతులవారన్నారు : హే శ్రేష్ఠులైన మునిసత్తములారా ! మరో కథ వినండి. ప్రాచీన కాలంలో ఉల్కాముఖుడనే పేరుగల ఒక బుద్ధి మంతుడైన రాజు ఉండేవాడు. ఆయన సత్యవ్రతాన్ని ఆచరించి, సత్యవ్రత ప్రచారం కొరకు, అందర్నీ పిలిచి ఉత్సవాలు జరిపేవాడు.

31. భద్రశీలా నదీతీరే, శుభయోజన ఈ దృశే
సమ్మిళితో ఉ భవత్సాధుః నామ్నా వ్యాపారవ్యావృతః

భద్రశీలా నదీతీరంలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సందర్భంలో సాధువనే పేరుగల ఒక వ్యాపారి వచ్చి పాల్గొని ప్రభావితుడై రాజునడిగి ఆ సత్యవ్రతము యొక్క వివేషాలను గ్రహించాడు.

**రాజు ఈ విధంగా అన్నాడు :**



32. వైశ్యధర్మః సమాజస్య, పదార్థానాం వ్యవస్థితం
అపేక్షితాన్ను స్సమూల్యేన, కరోత్యుత్పాదనస్యచ

రాజు అన్నాడు గదా, వైశ్యుని యొక్క ధర్మము సమాజము యొక్క ఆవశ్యకతల ననుసరించి, శుద్ధమైన వస్తువులను ఉత్పత్తిచేసి, వానిని ఉచితమైన ధరకు విక్రయించే వ్యవస్థను ఏర్పాటు చేయడం.

33. వైశ్యః స్వీయం సమాజస్య, సంవర్ధ్య నిజకర్మభిః
శాంతి సౌఖ్యం, యశోభాగీ, జాయతే జగతీతలే

సత్య, ధర్మపాలన చేసే వైశ్యుడు తన యొక్క సమాజము యొక్క సంపన్నతను, సుఖ శాంతులను అభివృద్ధి చేసుకుంటూ, గొప్ప కీర్తిని గూడా పొందగలడు. వ్రతాన్ని గురించిన విశేషాలను బాగా ఆకలింపు చేసుకొని వైశ్యుడు యింటికి వచ్చాడు.

34. పత్నీం లీలావతీం సర్వం, వృత్తం సో కథయత్తతః
సాపివ్రతంచ సత్యస్య శ్రద్ధయా పాలయేత్తథా ॥

ఆ వైశ్యుడు తన భార్య లీలావతికి యావద్వృత్తాంతమును తెలిపినంతనే, ఆమె గూడా శ్రద్ధగా సత్యధర్మాచరణ ప్రారంభించింది. భర్త చేసే మంచి పనులన్నిటికీ భార్య సహకరించింది. దాంపత్యంలో ఉన్నత మర్యాద అది.



35. భార్యాయాః వర్ధనంసాధు, ర్జ్ఞానస్య కృతవాన్వాణిక్
సుస్థితః పరివారస్య, సమృద్ధిశ్చాభవత్థలు

సత్యవ్రతుడైన వైశ్యుడు, ధర్మపత్నిని గూడా జ్ఞానోపదేశంతో యోగ్యురాలిని చేయసాగాడు. అందువల్ల అతని గృహంలో వ్యవస్థ, సంపన్నత, వేగంగా అభివృద్ధి చెందాయి. వారిద్దరూగూడా, తమసంపాదనలో కొంత భాగాన్ని సత్కార్యముల కొరకు నియమ రూపంలో వెచ్చించాలని సంకల్పించారు.

36. ప్రాప్తః స్వప్నేహి నిర్దేశః, కన్యాయాః కామనాంప్రతి
సౌభాగ్యాతరయోశ్చైషా, చిహ్నంమానోరపేక్షయా ॥

దంపతులిద్దరికీ సంతానం కావాలని కోరిక కలిగింది. స్వప్నంలో కుమారుని బదులుగా కుమార్తె కావాలని కోరమనీ, పుత్రిక సౌభాగ్యానికీ, ఆదరానికి చిహ్నమనీ ఆదేశం యివ్వబడింది.

"దశపుత్ర సమాకన్యా యస్యాః శీలవతీసుతా " అంటే, సులక్షణమైన కన్య పదిమంది కొడుకులతో సమానం. సీత, సావిత్రి, సుకన్యలవంటి వారు పుట్టిన వంశాన్నీ, మెట్టిన వంశాన్నీ తరింపజేశారు.



37. నిర్దేశం దంపతీప్రాప్య, హ్యాచారం ప్రతిపోలయన్
సుసంస్కారైర్హి సంపన్నా, కన్యాచోత్పాదితా దాదా ॥

ప్రాప్త నిర్దేశానుసారంగా, నియమ జీవనం గడిపిన కొన్నాళ్ళకు వారికి సంస్కారవతియైన పుత్రిక కలిగింది.

38. యదా వయసాజ్ఞాని, కులీన పరివారిణా
యూనా గుణవతాసాకం, సుశీలౌన వివాహితా ॥

ఆ కన్య కళావతి సుశిక్షితురాలై, యుక్తవయస్సు వచ్చిన తరువాత, ఒక కులీనమైన కుటుంబంలో జన్మించిన, గుణవంతుడైన యువకునికిచ్చి వివాహం చేయబడింది.

39. పుత్రవద్వణిజాతేన, యువకం శిక్షిత స్తదా
స్వహితై స్వహక్రేతువర్సచింతయతి నైహితం
యస్తం రక్షత్యవహితో, వ్యాపారీసత్య ఏవ సః ॥

40. బహుశో బోధితః పత్న్యాసత్కారోర్దేతు సద్వ్యయః
తవచోపేక్షితం సర్వంవిస్మృతం కల్పితంపురా ॥

వైశ్యుడు, బుద్ధిమంతుడైన తన అల్లుణ్ణి కుమారునితో సమానంగా భావించి, సుశిక్షితుని చేశాడు. వారు తమ హితంతోపాటు,

కొనుగోలుదారుల హితం గూడా ఆలోచించేవారు. వారు నిజమైన వ్యాపారులుగా పేరుపొందారు. బాగా ధనవంతులైనారు. కాని, సాధువైశ్యుడు సంకల్పించినట్లు తమ ఆదాయంలో కొంత భాగం సత్కార్యాలకు వినియోగించాలన్న మాటను మరచి పోవటం జరిగింది.

పతి అనుచితంగా ప్రవర్తిస్తే, దానిని నివారించడానికి సతి ప్రయత్నం చేయాలి. కానీ అదేం జరగలేదు.

41. సంతిగార్హస్థస్యనిర్వృత్తే, వానప్రస్థస్యజీవనం
జామాత్రాచ సహాన్యత్ర, వ్యాపారార్థంతు ప్రస్థితః ॥

తగిన వయస్సు వచ్చిన తరువాత గృహస్థ బాధ్యతను వదలి, వానప్రస్థ జీవనం చేయవలసిన సాధువైశ్యుడు, డబ్బుమీద వ్యామోహంతో వయస్సుపైబడినా వ్యాపారం వదలలేదు.

42. త్యాగాద్ధర్మస్య కార్యాణాం మానవే కుప్యతీస్వరః
దుఃఖమనుభవత్యేవ, సదాతత్కోపభాజనః ॥

స్వధర్మాన్ని వదలడం వల్ల మానవుడు భగవానుని కోపానికి గురియై దుఃఖాన్ని పొందుతాడు.



43. సాధు వైశ్యః సత్యధర్మ, విస్మృతాహ్యవిచారతః
ఉచితా నుచితంచైవ, తద్వృత్యోపార్జయేద్ధనం ॥

కర్తవ్యాన్ని మరచిన సాధువైశ్యుని సద్బుద్ధి క్షీణించి, లోభంతో ఉచితానుచిత వివేకం మరచి, అవినీతిపూర్వకంగా ధనం సంపాదించడం మొదలు పెట్టాడు.

44. రత్నసార పురస్య, సత్యనిష్ఠ ప్రజాజనైః
రాజ్యధికారిభిః కారాగృహే బద్ధోజాతో నృపశ్చసః ॥

అవినీతితో ధనం సంపాదించడం వల్ల, రత్నసారపుర మందలి సత్యనిష్ఠులైన ప్రజల ఫిర్యాదులవల్ల, రాజభటులు, రాజాజ్ఞ పొంది, సాధువైశ్యుని, అల్లుని కారాగారంలో బంధించారు.

45. అర్థాంగిన్యపి కర్తవ్యం కర్తుం సనానురోధితః
సాపి తస్మాద ధర్మవతో, జాతాచక్రోధ భాజనా ॥

ధర్మపత్నిగూడా, అవినీతి పరుడవుతున్న పతిని నివారించ నందున, ఆమె కూడా దుఃఖించవలసి వచ్చింది.



46. సర్వా సంపద్గృహాన్నూనం, విలీనాతస్య తక్షణాత్
తాభ్యా మితశ్చ తత్రాపి జ్ఞాతంచ దుఃఖకారణం
కర్తవ్యస్యత్యాగోహి చైకమేవాస్తి కేవలం ॥

ఇంటిలోని ధనమంతా పోయింది. కష్టాలపాలైన తర్వాత ఆ దంపతులు తమ తప్పు తెలుసుకున్నారు. సాధువైశ్యుడు చంద్రకేతు మహారాజు వద్ద తన తప్పు ఒప్పుకొని క్షమా ప్రార్థన చేశాడు.

**చంద్రకేతు ఉవాచ :**

47. అనీతిర్ధని నః సర్వాన్ కురుతే నీతి కారిణః
వ్యవస్థాచ సమాజన్య భ్రష్టాభవతి సర్వదా ॥

చంద్రకేత మహారాజు యిలా అన్నాడు. ధనవంతుడు అవినీతికి అంకితమైతే సామాన్యులు గూడా అతడిని అనుసరించి అవినీతికి పాల్పడటం సహజం. అప్పుడు సమాజం భ్రష్టుపట్టిపోతుంది.

48. అన్యాయోపార్జనంత్యక్త్వా స్వీయం మూలధనేనచ
విధాతంచ స్వవ్యాపారం సమర్థాఃసంతు వైతథా ॥

ఓ వైశ్యుడా ! నీవు అవినీతి పూర్వకంగా సంపాదించిన ధనాన్ని వదలి, నీ మూలధనంతో తిరిగి వ్యాపారం ప్రారంభించు.



49. అథైవం కృత్వావైశ్య కృపయా సత్రభోస్తదా
విపులోపార్జనం తస్య, విత్తస్య చాప్యజాయత ॥

వైశ్యుడు రాజు ఆదేశం ప్రకారం తిరిగి సత్యవ్రతుడై వ్యాపారం చేయసాగాడు. తిరిగి సత్యనారాయణ స్వామి కృప వలన విపుల ధనాన్ని ఆర్జించాడు.

50. కలావత్యపి విజ్ఞాతా, లీలావత్యా సహా పునః
హిత్వాపూర్వం విలాసేన, జీవనంచ ప్రధానతా

51. సేవా సద్భావయోర్థత్తా, కర్మరతస్యచ ధృవం
ప్రాప్తోధికాంశతో త్వర్థో, జాతా సత్యప్రభోః కృపా ॥

లీలావతి, కళావతీ గూడా తమ తప్పులు గ్రహించి, అంతకుముందు తాము గడుపుతున్న విలాసవంతమైన జీవనం వదిలి, సేవా సద్భావనలతో ధనాన్ని తిరిగిపొందగలిగారు. తిరిగి సుఖంగా జీవించసాగారు.

విలాసవంతమైన జీవనం వల్ల కష్టాలు పొందుతారు. నిరాడంబరంగా జీవిస్తూ ఉన్నత భావము గల్గినవారు సత్యనారాయణ స్వామి కృపకు పాత్రులు కాగలరు.

## నాల్గవ అధ్యాయము

**సూత ఉవాచ:**

52. ప్రచురధనమాదాయ, స్వర్ణాలంకార రత్నవత్
నౌకాయసౌ స్వకంసాధుః పురంగంతు ముపాక్రమత్ ॥

సూతులీవిధంగా అన్నారు. సాధు వైశ్యుడు చాలా బంగారాన్ని, ధనాన్ని, రత్నాలనూ నావమీద వేసుకొని తన నగరానికి బయలుదేరాడు.

53. సాధుః పరీక్షితః సత్య, నిష్ఠాయాంయత్ర సవణిక్
ప్రభుణా తర్షిపయసా, వృద్ధర్షిత్వ ముపేత్యవై ॥

సత్యనారాయణ స్వామి, ఒక గురుకులాన్ని నడిపే వృద్ధ బ్రాహ్మణుని వేషంతో సాధువైశ్యుని సత్యనిష్ఠను పరీక్షింపదలచి అతనివద్దకు వచ్చాడు.

54. ధనం సమాయతార్థంతు, స్వీయం సావర్ద్య శ్రద్ధయా
ప్రదాతం శక్యమే చాత్ర, భవతే యది రోచతే ॥

ఆ మహర్షి వేషధారియైన సత్యనారాయణ స్వామి, సాధువైశ్యునితో ఆశ్రమం నడపటానికి నీకు తోచినంత విరాళం యివ్వమని అడిగారు.



55. నిషేధో విహితస్తేన, విస్పష్ట వదనైస్తదా
కోపస్యభాజనం జాతో, వైశ్యస్తుచ్ఛధియా ప్రభౌః ॥

సాధువైశ్యుని మనస్సులో ధన సంగ్రహం మీద మోహం తిరిగి ప్రవేశించింది. నా నావలో అంతా ఆకులలములే తప్ప ధనం ఏమీ లేదని మహర్షితో బుకాయించాడు. అతని తుచ్ఛబుద్ధి తిరిగి స్వామికి కోపం తెప్పించింది.

56. భూత్వా దుర్ఘటనాగ్రస్తా, నౌకామగ్నాప్యాభూ త్తథా
ప్రయాసైర్నావికానాంచ, సజామాతారక్షితో భవత్ ॥

అతని నౌక దుర్ఘటనాగ్రస్తమై, సమస్త ధనంతో సహా మునిగిపోయింది. నావికులు ఎంతో ప్రయాసతో అల్లునితో సహా, సాధువైశ్యుని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

57. బుద్ధి సేవాపరాయణాం విత్తం సర్వం సదీతలాత్
నిఃసృతం స ప్రయాసేన, మనోయోగేన వాసినాం ॥

నది ఒడ్డున నివసించే బుద్ధిమంతులు, సేవాపరాయణులు కష్టపడి పనిచేసేవారూ అయిన ఆశ్రమవాసులు ఎంతో శ్రమపడి ధనమునంతటినీ నది అడుగు నుండి వెలికితీశారు.



58. భూత్వాచ సత్యనిష్టౌతౌ, వర్ధనే జన సంపదాం
పూర్ణేన్వజీననేజాతౌ, సుఖసౌభాగ్య భాగినౌ ॥

సాధువైశ్యుడు తన తప్పును తెలుసుకున్నవాడై, పశ్చాత్తాపంతో ఆ ధనములో ఎక్కువ భాగాన్ని ధర్మకార్యాలకు వినియోగించడానికి యిచ్చివేసి, ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ తరువాత వైశ్య దంపతులు జీవితాంతమూ, నిష్టాపూర్వకంగా, సత్యవ్రతులుగా, సమాజ సమృద్ధికి దోహదం చేస్తూ తాము స్వయంగా, సుఖమును కీర్తినీ, పుణ్యమునూ పొందగలిగారు.

59. ధనం నిర్వాహమాత్రంచ, గృహీత్వాజీవితుం పునః
వినియుజ్య తత్పరాచారే, సర్వేసుఖమవాప్నువన్ ॥

సామాన్యుల వలె జీవించడానికి తగిన ధనాన్ని మాత్రమే తమ కొరకు వెచ్చిస్తూ, మిగిలిదాన్ని సత్ప్రవృత్తుల పుణ్య ప్రచారము కొరకు వినియోగించారు.

60. తేషాం ప్రయత్నైరధికా, జాతాధర్మ ప్రవృత్తయః
గంతుమ సంఖ్యాః సన్మార్గం ప్రేరితాహి నవాస్తతః ॥

వారి సత్ప్రయాస వలన, సమాజంలో ధర్మప్రవృత్తి వృద్ధిచెంది, అనేకమంది సన్మార్గాన నడవాలనే ప్రేరణను పొంది తమ జీవితాలను సార్థకం చేసుకోగలిగారు.



## ఐదవ అధ్యాయము

61. అధాన్యం సంప్రవక్ష్యామి, శృణుధ్వం మునిసత్తమాః
అసీత్తుంగధ్వజోరాజా, ప్రజాపాలన తత్పరః ॥

సూతులు శౌనకాది మహామునులకు మరొక కథ చెప్పసాగారు. ఒకప్పుడు తుంగధ్వజుడనే రాజు పరిపాలన చేస్తుండేవాడు.

62. నృపతిరేకదాచాసౌ, స్వీయంరాజ్యం నిరీక్షితుం
శ్రోతుంచ సుఖదుఃఖాని, ప్రజానాం బహిరభ్రమత్ ॥

ఒకసారి అతడు ప్రజల స్థితిగతులను తెలుసుకోవడానికి, తన రాజ్యమంతటా తిరుగసాగాడు.

63. తత్ర వటతే పశ్యద్వన్యే గోపణాశ్చసః
ధారయితుం సత్యవ్రతం, ధర్మానుష్ఠాన్నం కుర్వతః ॥

అతడు ఒకచోట మర్రిచెట్టు క్రింద గోపపరివారము గుమిగూడి, సత్యనారాయణ వ్రతం చేస్తూ ఉండటం చూశాడు. ఆ గోపగణము శ్రమ దానంతో ఆ ప్రదేశాన్నంతటిని బాగుచేసి, సుందరంగా తయారుచేశారు.

64. ప్రజ్ఞాబలయుతైశ్చాపి, విద్యాశక్తిధనాన్వితైః
యోగదానంచ కర్తవ్యం సత్ప్రతిష్ఠా న కర్మణి ॥

సమాజంలో బుద్ధి, బలము, శక్తి, సంపద, విద్య గలవారు ఆవశ్యకమైనప్పుడు శ్రేష్ఠమైన కార్యములకు సహాయపడాలి.

65. అకుర్వన్ననురోధంతే, గోపాగత్వా నృపాంతికం
గ్రహీతుంతత్ప్రసాదంచ, భాగం నేతుం తదర్చనే ॥

గోపగణము రాజును సమీపించి, తమ ధర్మానుష్ఠానములో పాలుపంచుకుని ప్రసాదం తీసుకోమని ప్రార్థించారు.

66. మత్వానీచకులోత్పన్నాన్, తేషాం సాన్నిధ్యమేవచ
దోషం మత్వాత దారాజా స్పర్శ మాత్రంత ధైవచ ॥

కాని, రాజు వారిని నీచకులములో పుట్టినవారని, వారివద్ద కూర్చొనుట, వారిని తాకుట గూడా తప్పని భావించాడు. అట్టి భేదబుద్ధి, ఉపేక్ష, రాజుకు హానిని కలిగించాయి.

67. అవహేళనాయాః సత్య, ధర్మస్యచాపి భూపతేః
భిన్నా పరిజనాజాతా, యేహ్యా సత్కర్మకారిణః ॥

రాజు యొక్క తిరస్కారం రాజుకే హానిని కలిగించింది. ఆ ప్రవృత్తి వలన అతని కుటుంబ సభ్యులు, పరివారము అతడిని వదలివేశారు.



68. వ్యవస్థా, నిఖిలా, జాతా, సంపల్లుప్తంతధైవచ
సమాగతః విపత్తేశ్చ, హేతుమన్విష్యజ్ఞాతవాన్
నృపో పి యదహంకార, కర్తవ్యచ్యుతి స్వార్థతా ॥

వ్యవస్థ నశించింది. రాజు యొక్క ధనము, సన్మానము (గౌరవము) పోయాయి. ఈ విధమైన ఆపదలు చట్టుముట్టడంతో రాజుకు జ్ఞానోదయమైనది. కొన్నాళ్ళకు తన అహంకారము తన కర్తవ్య విముఖత, తనను ఆ స్థితికి తీసుకొని వచ్చినట్లు గ్రహించాడు.

69. విలోక్య దుర్దశాం స్వీయం, కుర్వన్‌దోషిణోఽ పరాన్
భూపో విశ్లేషణం స్వస్య, కృతవాన్ స్వయమేవచ ॥

బుద్ధిమంతుడు కావడంవలన, రాజు తన దుర్దశకు ఇతరులపై నెపం వేయక, తన్ను తాను విశ్లేషణ చేసుకున్నాడు.

70. బుధ్యాచావగతం తేన, సద్ధర్మోపేక్షయామమ
అధో ధః పతనం జాతం నాన్యదత్ర చ కారణమ్ ॥

సత్య, ధర్మములను ఉపేక్షించడం వల్లనే తనకు యిట్టి దుర్దశ కలిగిందని ఆయన గ్రహించ గలిగాడు.

71. అవమానం కృతంపూర్వం, తిరస్కృత్యేతి గోపకాన్
ధ్యాత్వా తేషాం సమీపేచ, హ్యనుతప్తో గతోనృపః ॥



రాజుకు గోపగణం గుర్తుకు వచ్చారు. తాను వారిని అవమానించినందుకు పశ్చాత్తాపం కలిగింది. తాను స్వయంగా వారివద్దకు వెళ్ళి, వారిని క్షమించమని కోరి, మార్గదర్శనాన్ని యాచించాడు. వారిలో ఒక వయో వృద్ధుడు ఈ విధంగా అన్నాడు.

72. కార్యాహి సత్యప్రతినా, త్యక్త్వాభేదస్య భావనామ్
వృత్తిర్గ్రహీతుం శ్రేష్ఠాని, తత్వాని ప్రతిస్థాపతః ॥

సత్యమార్గమును గ్రహించినవారు, భేదభావమును వదలి, శ్రేష్ఠమైన తత్వం ఎక్కడ ఉంటే, అక్కడ నుండి గ్రహించాలి.

73. స్వాత్మయోగ్యతయా స్వీయ, పరివారాయచాధికమ్
లాభందాతుం సముత్సాః, సర్వేషుభవతి ధృవః ॥

మనలో ప్రతియొక్కరూ తమ యోగ్యతతో, శ్రమతో, తమ సమాజము నంతటినీ అధిక లాభాన్వితం చేయడానికి ఉత్సాహాన్ని పొందాలి. అటువంటి ప్రవృత్తిని మీ పరివారంలో గూడా పెంపొందించండి.

74. సత్యజ్ఞానం శ్రుతంరాజ్ఞా మననంచ కృతం తథా
నిర్ధారితస్తతశ్చైవ రుచిరః జీవనక్రమః ॥



రాజు సత్య, ధర్మముల ప్రశస్తిని ఆసక్తితో విని, వాటిని మననం చేసుకుని, ఆ విధంగా జీవితక్రమాన్ని నిర్ధారించుకున్నాడు. శ్రమ ప్రతిష్టా అభియానంలో గోపకులకు సహకరించాడు. సామూహిక శ్రమదాన కార్యక్రమాలకు ప్రచారం లభించింది. ఆయనకు తిరిగి ధన, ధాన్య సమృద్ధి కలిగింది. ప్రతిష్ఠ పెరిగింది.

75. య ఇదం కురుతే సత్యవ్రతం పరమ దుర్లభం
దరిద్రో లభతేవిత్తం, బద్ధోముచ్యేత బంధనాత్ ॥

సూతులన్నారు, హే మునులారా! సత్యవ్రతమును ధరించినవారు, దరిద్రులైనా, భగవానుని కృపకు పాత్రులై, ధనదాన్యములను సమృద్ధిగా పొంది, ముక్తులు కాగలరు.

76. భీతో భయాద్విముచ్యేత, సత్యమేన న సంశయః
ఈప్సితం చ ఫలం లబ్ధ్వాంతే సత్యపురంవ్రజేత్ ॥

భయభీతులైనవారు నిర్భయులు కాగలరు. సాధకులు ప్రాపంచిక ఫలములను సంపూర్ణంగా పొంది, అంత్యకాలంలో సత్యలోక నివాస ప్రాప్తిని పొందగలుగుతారు. ఇందుకు ఏ మాత్రం సందేహం లేదు.

**- ఇది సత్యనారాయణ వ్రతకథా సమాప్తమ్ -**